క్లుప్తంగా

రైల్వే సీఐగా ఏడుకొండలు



పిడుగురాళ్ల: పిడుగురాళ్ల రైల్వే పోలీస్ స్టేషన్ సీఐగా కె. ఏడుకొండలు శుక్రవారం బదిలీపై వచ్చారు. ఆయన గతంలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో విధులు నిర్వర్తించారు. ఆయనకు సిబ్బంది పుష్పగుచ్ఛం ఇచ్చి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. రైల్వే ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

15న పోలీస్ గ్రీవెన్స్ డే

పిడుగురాళ్ల: పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో ఈ నెల 15వ తేదీన గ్రీవెన్స్‌డే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పట్టణ సీఐ ఆంజనేయులు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు ముమ్మరం



మాచర్ల రూరల్: మారిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో శుక్రవారం మండలంలోని తాళ్ళపల్లి, భైరవునిపాడు, కొత్తపల్లి గ్రామాలలో పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. చెత్త తొలగింపు, డ్రైనేజీలో పూడికతీత చేపట్టారు. అంటు రోగాల నివారణకు ప్రజలు వీధులను శుభ్రంగా ఉంచాలని ప్రచారం చేశారు. సర్పంచ్‌లు ఓరుగంటి జయప్రకాష్‌రెడ్డి, పి. బ్రహ్మానాయుడు, భైరవునిపాడు కార్యదర్శులు ఆవుల వెంకట్రామయ్య, ఎల్లెబోయిన కోటేశ్వరరావులు పనులను పర్యవేక్షించారు.

ద్విచక్ర వాహనం చోరీ

మాచర్ల రూరల్: ఇంటి ముందు పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. ఈ సంఘటన పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో ముళ్ళ ఆసుపత్రి వద్ద చోటుచేసుకుంది. పట్టణానికి చెందిన మున్సిపల్ ఉద్యోగి భైరు రామారావు తన ద్విచక్ర వాహనాన్ని ఇంటి ముందు పార్కు చేశారు. తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు వాహనాన్ని దొంగిలించినట్లు ఆయన చెప్పారు. ఈ మేరకు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

బాల్య వివాహాలను అరికడదాం



రాజుపాలెం: బాల్య వివాహాలను అరికట్టాలని ప్రధానోపాధ్యాయురాలు నాగమల్లేశ్వరి అన్నారు. బాల్య వివాహాల నిర్మూలనపై కిశోర బాలికలకు అవగాహన సమావేశం మండలంలోని పెదనెమలిపురి జిల్లా పరిషత్ పాఠశాలలో సమగ్ర శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం నాగమల్లేశ్వరి మాట్లాడుతూ రుతు క్రమంలో వచ్చే అపోహలను కిశోర బాలికలకు వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్. స్వర్ణలత, అంగన్‌వాడీ కార్యకర్తలు వై.శైలజ, ఎన్.కనకదుర్గ, ఆర్.పద్మ, ఎస్.వెంకటరమణ, బి.సోమమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఊరికి, పాఠశాలకు విద్యార్థులు పేరు తేవాలి

మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ బెల్లంకొండ రామగోపాలరావు



పెదకూరపాడు: పుట్టిన ఊరికి, జన్మనిచ్చిన తల్లిదండ్రులకు, చదువులు నేర్పిన గురువులకు ఉత్తమ పౌరులుగా ప్రతి విద్యార్థి పేరు తీసుకురావాలని క్రోసూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్, మాజీ ఎంపీపీ బెల్లంకొండ రామగోపాలరావు అన్నారు. పెదకూరపాడులోని జెడ్పీ పాఠశాలలో శుక్రవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్ చిత్ర పటాలను ముఖ్య అతిథిగా హాజరైన బెల్లంకొండ రామగోపాలరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామగోపాలరావును ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పూర్వ విద్యార్థిగా పాఠశాల అభివృద్ధికి తనవంతు కృషి చేశానని గుర్తుచేశారు. గ్రామ పెద్దలు ఆర్తిమళ్ల రమేష్, భాష్యం ఆంజనేయులు, నెల్లూరి మల్లికార్జునరావులు పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహాయం చేస్తామని తెలిపారు.

చినుకు కురవక.. విత్తు మొలవక...

రుతుపవనాలు ఊరిస్తున్నా.. మేఘాలు గర్జిస్తున్నా.. కారుమబ్బులు కమ్ముకుంటున్నా.. చినుకు మాత్రం కురవనంటోంది. వరుణుడు మాత్రం కరుణ చూపటం లేదు. సగటు వర్షాలు బావురుమంటున్నాయి. నాగార్జున సాగర్ జలనిధి అడుగంటిపోవటంతో ఖరీఫ్ సాగుకు నీటి కేటాయింపులు చేపట్టలేదు. బోర్లు, బావులలో నీరు లేక మెట్ట ప్రాంతాలలో పొలాలలో పంటలు వేద్దామన్నా ఉపయోగం లేకుండా పోయింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా.. సాగు ప్రశ్నార్థకంగా మారటంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. – మాచర్ల రూరల్

- వానల్లేక ఆందోళనలో అన్నదాతలు
- ప్రశ్నార్థకంగా ఖరీఫ్ మెట్ట ఫైర్లు
- పత్తి సాగుపై ఇప్పటికే తీవ్ర ప్రభావం



ఎండిపోతున్న పత్తి సాగు



వర్షం కోసం ఎదురుచూస్తున్న రైతన్న

ఆరుగాలం శ్రమించే అన్నదాతకు కష్టాలు తప్పడం లేదు. చినుకు జాడ లేక వేసిన పంటలు ఎండిపోతున్నాయి. రైతన్న పంటలను చూసి బాధపడుతూ వరుణ దేవుడివైపు ఆశగా చూస్తున్నాడు. తొలకరి తొంగి చూసిందే కానీ వాన జాడ కనిపించడం లేదు. ఏడాది జూన్ మొదటి వారంలోనే నైరుతి రుతుపవనాలు ఆగమనం చేసినా చిరుజల్లులకే పరిమితమయ్యాయి. అక్కడకక్కడ కురిసిన వర్షాలతో అన్నదాతలు పత్తి పంట సాగుకు శ్రీకారం చుట్టారు. వేసిన పంటలకు ఇప్పుడు నీరు లేక ఎండిపోతున్న దుస్థితిని చూసి ఆందోళన చెందుతున్నారు. అసలే వారికి అందించే రైతు భరోసా ఇప్పటికీ అందలేదు. అప్పులతో వ్యవసాయ పనులు చేపట్టారు. విత్తనాలు కొనుగోలు చేసి ఆశతో సాగు చేస్తున్నారు. గత ఏడాది ఇదే సమయానికి రైతు భరోసా మొదటి విడతగా రూ. 7500 పెట్టుబడి సాయంగా అందించిది నాటి వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం. నేడు వ్యవసాయ పనులు ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా ఇంత వరకు రైతులకు పెట్టుబడి సాయం ఊసే లేదు. ఎప్పుడందిస్తారో కూడా తెలియని పరిస్థితి. వ్యవసాయంపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న రైతన్నల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది.

కరవు తప్పని పరిస్థితులు



ఈ ఏడాది రుతుపవనాలు ముందుగానే వస్తున్నాయని అధికారులు చెప్పడంతో రైతన్నలు కూడా వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు. అడపాదడపా వర్షాలు తప్పితే చెప్పుకోదగ్గ స్థాయిలో పడిందే లేదు. ముందుగా వేసిన పంటలు ఎండిపోతున్నాయి. కొత్తగా వేయలేక వర్షం కోసం ఎదురుచూస్తున్నాం.

– పోతురెడ్డి కోటిరెడ్డి, రైతు, కొత్తపల్లి

ఆశలన్నీ వర్షాలపైనే



వర్షాధారంపైనే ఆధారపడి పంటలు సాగు చేస్తుంటాం. సాగుకు సమయం దాటిపోతోంది. ఇంతవరకు సమృద్ధి స్థాయిలో వానలు కురవకపోవటంతో వ్యవసాయం ప్రశ్నార్థకమైంది. వ్యవసాయ పనుల కోసం అప్పులు చేసి సాగుకు సిద్ధమయ్యాం. ప్రభుత్వం అందించాల్సిన రైతు భరోసా ఇవ్వలేదు. ఇలా అయితే రైతు పరిస్థితి, వ్యవసాయం ప్రశ్నార్థకమే.

– ఓరుగంటి జయప్రకాష్, కొత్తపల్లి, రైతు

విత్తన శుద్ధిపై రైతులకు అవగాహన పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏవో బ్రహ్మారెడ్డి

రెంటచింతల: ఖరీఫ్ సీజన్‌లో వివిధ రకాల పంటలను సాగు చేస్తున్న రైతులకు విత్తన శుద్ధిపై అవగాహన కల్పించాలని మండల వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో గ్రామ వ్యవసాయ సహాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విత్తన శుద్ధి వల్ల అధిక దిగుబడులను సాధించడంతో పాటు ఇతర ప్రయోజనాలను కూడా ఉంటాయన్నారు. వరి పంట సాగు చేస్తున్న రైతులు పది లీటర్ల నీటిలో 1.5 కిలోల ఉప్పు కలిపి ఎంపిక చేసుకున్న విత్తనాలను పోయాలన్నారు. నీటిపై తేలిన తాలు విత్తనాలను తీసివేసి మునిగిన వాటితోనే నారు పోసుకోవాలని సూచించాలన్నారు. కిలో వరి విత్తనాలను లీటరు నీటిలో 2.5 గ్రాముల కార్బండజిమ్ కలిపి 24 గంటలపాటు నానబెట్టిన అనంతరం మరో 20 నుంచి 24 గంటల పాటు మంచినీటిలో ఉంచాలని చెప్పారు. అనంతరం నారు మడులలో చల్లుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించాలని సూచించారు. విత్తనాల ద్వారా సంక్రమించే వివిధ తెగుళ్ల నివారణ కోసం కిలో విత్తనాలకు 3 గ్రాముల థైరమ్ లేదా కాప్టాన్ మందును కలిపి శుద్ధి చేసుకోవాలని అవగాహన పెంచాలని కోరారు. నారుమడిలో ఆకు తినే పురుగులు, ఉల్లికోడు, మొవ్వపురుగు సోకకుండా ఉండటానికి మొలకెత్తిన విత్తనాన్ని నారు మడిలో చల్లే ముందు 0.2 శాతం క్లోరిప్రేరిఫాస్ ద్రావణంలో నానపెట్టి చల్లుకోవడంతో మేలు జరుగుతుందని రైతులకు అవగాహన కలిగించాలన్నారు. కార్బనిజంతో కలిపి విత్తన శుద్ధి చేసుకోవచ్చని, కిలో పత్తి విత్తనాలను 8 గ్రాముల ట్రైకో డెర్మావిరిడితో, కిలో మిరప విత్తనాలను 8 నుంచి 10 ఎంఎల్ గౌచో ద్రావణంలో శుద్ధి చేయడం మంచిదని వివరించాలని సూచించారు. విత్తన శుద్ధి చేసి సాగు చేస్తున్న పంటలను చీడపీడల నుంచి కాపాడుకోవచ్చని వివరించాలని తెలిపారు. పత్తి చుట్టూ అంతర పంటగా 4 సాళ్లకు ఒక సాలులో కంది, మినప, పెసర పంటలను వేయాలని సూచించాలన్నారు. మాగాణి చుట్టూ గట్టుపై కంది పంటను అంతర పంటగా సాగు చేయడం వల్ల అదనపు ఆదాయం కూడా వస్తుందని వివరించాలన్నారు. వ్యవసాయశాఖ కూడా అంతర పంటలను సాగు చేసే రైతులను ప్రోత్సహిస్తుందని తెలపాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పిడుగురాళ్ల: పట్టణంలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని పట్టణ ఏఈ శివనాగిరెడ్డి శుక్రవారం తెలిపారు. 11 కేవీ ఆర్ఆర్ ఫీడర్ మరమ్మతుల కారణంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు. కొండమోడు నుంచి జానపాడు రోడ్డు వరకు రోడ్డుకు ఎడమ వైపు ప్రాంతంలో సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

మాచవరం: మాచవరం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం శనివారం మండలంలోని మాచవరం, పిన్నెల్లి, చెన్నాయపాలెం, మోర్జంపపాడు పరిధిలోని గ్రామాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈ కె.పెదమస్తాన్ తెలిపారు.

దాచేపల్లి: నగర పంచాయతీతో పాటుగా గ్రామాల్లో కూడా శనివారం విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏఈలు భగవాన్ నాయక్, నాగేశ్వరరావు శుక్రవారం తెలిపారు. మరమ్మతుల కారణంగా మండల వ్యాప్తంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని చెప్పారు.

కారెంపూడి: మండలంలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరా ఉండదని ఏఈ కె. కోటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33 కేవీ విద్యుత్తు స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం సరఫరాను నిలిపేయనున్నట్లు పేర్కొన్నారు.

ఫిరంగిపురం: నరసరావుపేట 220 కేవీ విద్యుత్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం సరఫరాలో అంతరాయం కలగనుందని శుక్రవారం విద్యుత్‌శాఖ ఏఈ పుల్లారెడ్డి తెలిపారు. సుదురుపాడు, ఫిరంగిపురం సబ్‌స్టేషన్ల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఉదయం 7 – మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోనుంది.

25 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ



మల్లవరం మండల ప్రాథమికోన్నత పాఠశాల

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాల ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం 25 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మండల పరిధిలోని 11 గ్రామాలలో మొత్తం 36 ప్రభుత్వ పాఠశాలలు కొనసాగుతున్నాయి. 124 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహించాల్సి ఉండగా.. 99 మంది ఉన్నారు. 2024–25 విద్యాసంవత్సరం జూన్ 13న ప్రారంభం కాగా 3,852 మంది చదువుకుంటున్నారు. ఇప్పటివరకు జిల్లా విద్యాశాఖాధికారులు ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ చేయడానికి చర్యలు చేపట్టడం లేదు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. 2023–24 విద్యాసంవత్సరం చదువుతూ పై తరగతులకు వచ్చిన 3,436 మంది విద్యార్థులకు మాత్రమే స్టూడెంట్స్ కిట్స్ అందించారు. ఈ విద్యాసంవత్సరంలో పలు ప్రభుత్వ పాఠశాలల్లో కొత్తగా చేరిన సుమారు 400 మందికి ఇప్పటి వరకు స్టూడెంట్స్ కిట్స్ పంపిణీ చేయలేదని సమాచారం. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పేద ప్రజల పిల్లలకు బోధించేందుకు వెంటనే ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయడానికి జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజం ఎంతో అవసరం



కారెంపూడి: ప్లాస్టిక్ వినియోగం పర్యావరణానికి తీవ్ర నష్టమని, చెట్లను తొలగించడం తగదనే విషయాన్ని అందరూ గుర్తించాలని కారెంపూడికి చెందిన పర్యావరణవేత్త కొమెర అంకారావు (జాజి) విద్యార్థులకు వివరించారు. మండలంలోని పేటసన్నెగండ్ల నరసింహపురి శ్రీ చక్ర సిమెంట్స్ కాలనీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పర్యావరణంపై ప్రకృతి పాఠం బోధించారు. విద్యార్థులు ప్రతి చెట్టును పూజించాలని సూచించారు. తగినంత అడవులు లేకపోతే మానవ మనుగడ కష్టం అన్నారు. అందరం దీనిని నిర్లక్ష్యం చేస్తున్నామని వివరించారు. విత్తన బంతులతోపాటు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు అందరూ సహకరించాలని వివరించారు.

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి

నాదెండ్ల: విద్యుదాఘాతానికి గురై రెండంతస్తుల డాబాపై నుంచి పడి కార్మికుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం సాతులూరు గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మేరకు అప్పాపురం ఎస్సీ కాలనీకి చెందిన చెరుకూరి శ్రీహర్ష అలియాస్ ఏసు దాసు (22) నూతన గృహాలకు ఎలివేషన్ అద్దాలు బిగించే పనులు చేస్తుంటాడు. ఈ క్రమంలో నాదెండ్ల గ్రామానికి చెందిన మేస్త్రి వద్ద పని చేస్తూ కొంత కాలంగా సాతులూరులో నూతనంగా నిర్మించిన ఓ గృహానికి రెండో అంతస్తులో అద్దాలు బిగిస్తున్నాడు. శుక్రవారం ఉదయం 9 గంటలకు పనులు ప్రారంభించిన కొద్దిసేపటికీ విద్యుదాఘాతానికి గురై డాబాపై నుంచి కిందపడ్డాడు. దీంతో స్థానికులు శ్రీహర్షను హుటాహుటిన నరసరావుపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. అయితే ప్రమాదం జరిగిన డాబా వద్ద సరైన ఏర్పాట్లు లేని కారణంగానే ప్రమాదం చోటు చేసుకున్నట్లు తోటి కార్మికులు వాపోయారు. మృతుడి బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి తండ్రి గతంలోనే మృతి చెందగా, తల్లి లక్ష్మి, సోదరుడు మార్కుతో కలిసి జీవిస్తున్నాడు. మృతుడు అవివాహితుడు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

వైద్యాధికారి డాక్టర్ రాజేష్‌కుమార్

అచ్చంపేట: సీజనల్‌గా వచ్చే జ్వరాలు, ఒళ్లు నొప్పులు, జలుబు వంటి వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రాజేష్‌కుమార్ తెలిపారు. మండలంలోని పెదపాలెం ఎస్సీ కాలనీలో నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు. దోమల ద్వారానే వ్యాధులు ఉధృతమవుతాయని, లార్వా దశలోనే దోమలను నశింపచేయాలని డాక్టర్ రాజేష్ సూచించారు. జ్వర తీవ్రత తగ్గేంత వరకు ప్రతి ఒక్కరు కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. వైద్య శిబిరంలో 45 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, జ్వరాలతో బాధపడుతున్న 8 మందికి రక్త పరీక్షలు చేశారు. జ్వరాల వల్ల భయపడాల్సిన పనిలేదని, ప్రస్తుతం వర్షాలు పడుతున్నందు వల్ల సీజనల్‌గా వచ్చే జ్వరాలేనన్నారు. మందులు పంపిణీ చేశారు. అనంతరం కాలనీలో ఇంటింటికి ఫీవర్ సర్వే నిర్వహించారు. ఇంటి పరిసరాలను ఏ విధంగా పరిశుభ్రంగా ఉంచుకోవాలని కాలనీ వాసులకు అవగాహన కల్పించారు. సైడు కాలువలలో ఎబెట్ ద్రావణాన్ని స్ప్రే చేయించారు. మురుగు కుంతలలో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ఇంటి ఆవరణలో నీరు నిల్వ ఉండే ప్రాంతాలను పరిశీలించారు. వాడని గాబులను బోర్లించాలని, తాగేసిన కొబ్బరిబొండాలను ఊరికి దూరంగా వేయాలని, ఎరువు దిబ్బలను ఇంటి పరిసరాలలో ఉంచుకోకూడదని చెప్పారు. వైద్య శిబిరం మరో నాలుగు రోజులు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి పి.వెంకట్రావు, పర్యవేక్షకులు రాధాకృష్ణ, బేబిరాణి, సీహెచ్‌వో శివనాగమణి, సబ్‌సెంటర్ హెల్త్ అసిస్టెంట్ జి.చిన్నపరెడ్డి, ఏఎన్ఎం దుర్గ, ఆశావర్కర్స్ ఎం.సుజాత, సీహెచ్ సుజాత, టి.చిన్నమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

డెంగీ నివారణపై అవగాహన ర్యాలీ



నకరికల్లు: వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించి దోమల వ్యాప్తిని అరికట్టడంలో పాలు పంచుకోవాలని జిల్లా డీఎంవో డాక్టర్ రత్నాకర్ పిలుపునిచ్చారు. డెంగీ వ్యతిరేక మాసోత్సవ కార్యక్రమంలో భాగంగా స్థానిక పీహెచ్‌సీ నుంచి శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. డెంగీ నివారణే ఉత్తమ రక్షణ అంటూ నినదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 1 నుంచి 31 వరకు డెంగీ వ్యతిరేక మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమాజ భాగస్వామ్యంతో డెంగీ నివారిద్దామన్నారు. తీవ్ర జ్వరం, చలి, ఒంటి నొప్పులు, కీళ్లు, కండరాల నొప్పులు, చర్మంపై దద్దుర్లు, అలసట తదితర లక్షణాలను డెంగీగా గుర్తించాలన్నారు. లక్షణాలను బట్టి సంబంధిత వైద్యశాలలో చికిత్స తీసుకుంటే వ్యాధి నుంచి బయటపడవచ్చని సూచించారు. కార్యక్రమంలో స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి మణికంఠ, పీహెచ్‌సీ సిబ్బంది, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

కందిపప్పు విక్రయ కేంద్రం ప్రారంభం



కందిపప్పును అందజేస్తున్న తహసీల్దార్ శ్యామ్ సుందర్‌రాజు

పిడుగురాళ్ల: సబ్సిడీ కందిపప్పును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్యామ్ సుందర్‌రాజు సూచించారు. పట్టణంలోని జానపాడు రోడ్డులోని వాసవీ కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపం ప్రాంగణంలో సబ్సిడీపై కందిపప్పు విక్రయ కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పల్నాడు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ కేంద్రాన్ని ప్రారంభించామన్నారు. కిలో రూ. 160కి అందిస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సబ్సిడీ తహసీల్దార్ సరోజ, దాల్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు కొత్త సత్యనారాయణ, పెండ్యాల రామారావు, ఏలూరి లక్ష్మయ్య, కొత్త హనుమంతరావు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు గుండా రామారావు, కట్టమూరి శంకర్‌రావు, శివయ్య, ఏలూరి చంద్రశేఖర్‌రావు, హనుమంతరావు, లక్ష్మణబాబు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల మెరుగుకు చర్యలు

ఎంపీపీ బూడిద మంగమ్మ



సమావేశంలో మాట్లాడుతున్న బూడిద మంగమ్మ

మాచర్ల రూరల్: గ్రామాలలో ప్రబలుతున్న అంటువ్యాధుల నివారణకు అధికారులు వెంటనే పారిశుద్ధ్య పనులను మెరుగు పరచాలని ఎంపీపీ బూడిద మంగమ్మ కోరారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. మారిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో గ్రామాల్లో డయేరియా, మలేరియా, డెంగీ వంటి వ్యాధులు వ్యాపిస్తున్నాయని గుర్తుచేశారు. వీటి నివారణకు కాలువలలో పూడికతీత పనులు, వీధులు శుభ్రపరచటం, బ్లీచింగ్ పౌడర్ చల్లడం, దోమల నివారణకు ఫాగింగ్ వంటి పనులను వేగవంతం చేయాలని సూచించారు. వ్యవసాయ పనులు ప్రారంభమవుతున్న సమయంలో రైతులకు కావాల్సిన సలహాలను అధికారులు అందించాలని కోరారు. నిరంతర విద్యుత్ సరఫరా అయ్యేలా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. వైద్యులు గ్రామాలలో పర్యటించి డయేరియా నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. జెడ్పీటీసీ మండ్లి పెద మల్లుస్వామి మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా అధికారులు, ప్రజా ప్రతినిధులు గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలని కోరారు. పార్టీలకతీతంగా నాయకులు కలిసి ప్రగతి కోసం సాగాలని సూచించారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీలు పోతురెడ్డి సుజాత కోటిరెడ్డి, పరిమళ మనీషా, ఎంపీడీవో సరోజనీదేవి, ఎంపీటీసీలు శ్రీనివాసరెడ్డి, రంగానాయక్, అధికారులు డాక్టర్ శివలీల, ఎంఈవో అల్లి సురేష్, ఆర్ఐ శ్రీనివాసరావు, సర్పంచ్‌లు ఓరుగంటి జయప్రకాష్‌రెడ్డి, ముక్కా గురవయ్య, మాధ్యానాయక్, బ్రహ్మానాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఒకే పాఠశాల నుంచి నలుగురికి ట్రిపుల్ ఐటీ సీట్లు



కోటా హారిక



గుండా యమున



యారం కృష్ణ చైతన్య



గునపాటి నవ్య

మాచవరం: మండలంలోని మోర్జంపాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన నలుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ఎంఈఓ శ్రీధర్ తెలిపారు. కోటా హారిక, గుండా యమునలు నూజివీడులో సీట్లు సాధించారని చెప్పారు. యారం కృష్ణచైతన్య, గునపాటి నవ్య ఒంగోలు క్యాంపస్‌కు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థులకు ఉపాధ్యాయ బృందం, గ్రామ పెద్దలు అభినందనలు తెలిపారు.

ట్రిపుల్ ఐటీలో సీటు

కారెంపూడి: మండలంలోని చినగార్లపాడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని గొట్టిముక్కల కీర్తి నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిందని హెచ్ఎం వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. పదవ తరగతిలో ఆమె 576 మార్కులు సాధించింది.

ప్రభుత్వ కళాశాలలో మధ్యాహ్న భోజనం



భోజనం వడ్డిస్తున్న దాతలు, స్థానికులు

దాచేపల్లి: నారాయణపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని శుక్రవారం ప్రారంభించారు. కళాశాల అభివృద్ధి కమిటీ, దాతల సహకారంతో ఇంటర్ విద్యార్థులకు ప్రతి రోజు మధ్యాహ్నం భోజనాన్ని ఉచితంగా అందించనున్నారు. కమిటీ సభ్యులు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. దాతల సహకారంతో 21 సంవత్సరాలుగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. విద్యార్థులు కూడా చదువులో రాణిస్తూ మంచి ఫలితాలు సాధిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ టి.జె. చంద్రశేఖర్, కమిటీ సభ్యులు తెలనాకుల సత్యనారాయణ, మందపాటి రమేష్‌రెడ్డి, బుర్రి కృష్ణారెడ్డి, తెలనాకుల కాసులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ లేకుండా వాహనాలు నడపొద్దు



మాట్లాడుతున్న మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు

క్రోసూరు: ద్విచక్ర వాహనదారులంతా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు, ఎస్సై షఫీ సూచించారు. శుక్రవారం క్రోసూరులోని మసీద్ సెంటర్‌లో హెల్మెట్ వాడకంపై వాహన చోదకులకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనం నడుపుతున్న సమయంలో ప్రమాదం జరిగితే ఎక్కడ గాయమైనా కోలుకోవచ్చు. తలకు గాయమైతే మాత్రం కోలుకోవడం కష్టమని.. కోమాలోకి వెళ్లే ప్రమాదం కూడా ఉందన్నారు. చిన్న అజాగ్రత్త వల్ల భారీ నష్టాన్ని కొని తెచ్చుకోవద్దని సూచించారు. హెల్మెట్ ధరించడం మీ క్షేమం, మీపై ఆధారపడిన మీ కుటుంబ సభ్యుల కోసమని తెలుసుకోవాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, లేకపోతే ప్రమాదాల బారిన పడటమే కాక ఒక్కోసారి ప్రాణాలు పోయే ప్రమాదం ఉందన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ లేకుండా ప్రయాణం చేయడం, కారులో ప్రయాణించే వారు సీటు బెల్టు ధరించకపోవడం చట్టరీత్యా నేరమన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వ కూడదని, అలా ఇస్తే వాహన యజమానులకు, తల్లిదండ్రులకు శిక్ష పడుతుందన్నారు. అలాగే వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని.. సకాలంలో వాహనానికి ఇన్సూరెన్స్ చేయించాలని తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ద్విచక్ర వాహనదారులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

15 నుంచి ఉపాధి హామీ గ్రామ సభలు

ముప్పాళ్ళ: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లోను ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్‌లో భాగంగా ఈ నెల 15 నుంచి గ్రామ సభలు జరుగుతాయని ఎంపీడీవో పి.శ్రీకృష్ణ శుక్రవారం తెలిపారు. 15వ తేదీన కుందురువారిపాలెం, గోళ్ళపాడు, రుద్రవరం గ్రామాల్లోను, 16న తొండపి, మాదల, లంకెలకూరపాడు గ్రామాల్లోను, 18న బొల్లవరం, దమ్మాలపాడు గ్రామాల్లోను, 19న తురకపాలెం, ముప్పాళ్ళ, చాగంటివారిపాలెం, పలుదేవర్లపాడు, ఇరుకుపాలెం, నార్నెపాడు గ్రామాల్లోను గ్రామ సభలు జరుగుతాయన్నారు. ఆయా గ్రామాల్లోని గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద జరిగే గ్రామ సభలలో ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి సోషల్ ఆడిట్ సభ్యులు గుర్తించిన అంశాలపై చర్చించటం జరుగుతుందన్నారు. పనులకు సంబంధించి నిర్వహణలో ఏమైనా లోపాలుంటే అధికారుల దృష్టికి తీసుకురావచ్చన్నారు.